అమెరికన్ మోషన్ పిక్చర్స్ అసోసియేషన్ ఈ చౌర్యాన్ని ఎలా అరికట్టాలా అని ఆలోచించింది. కొన్నివేల వీడియో టేప్స్ భారతదేశం వెళ్ళకుండా ఆపడం అసాధ్యం కాబట్టి, వాటిని కాపీకొట్టే కొద్దిమంది మీద చట్టరీత్యా అమెరికాలో కాపీరైట్ ఏక్టు క్రింద చర్య తీసుకోవడం మంచి దనే నిర్ణయానికొచ్చారు అయితే అమెరికన్ క్రిమినల్ కోర్టుల జూరిస్ డిక్షన్ అమెరికా దేశానికే పరిమితం కాబట్టి వాళ్ళని ఆహ్వానం పేరిట అమెరికాకి రప్పించారు! వాళ్ళు రావడానికి వో రోజు ముందే కేసులని దాఖలు చేయడంతో అరెస్టు వారెంట్స్ పోలీసులు తీసుకున్నారు. వారు హాలీవుడ్ చిత్రాల ఆధారంగా నిర్మించిన తెలుగుసినిమా వీడియో టేప్‌లు కోర్టులో ప్రదర్శించి వాళ్ళ నేరాలని నిరూపించాలని అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అమెరికన్ కాపీరైట్ యాక్టు క్రింద నేరాలు రుజువయితే ఒక్కొక్కరికీ పన్నెండేళ్ళదాకా శిక్ష పడవచ్చు.

కాపీ కొట్టాలనుకునే నిర్మాతలకి హెచ్చరికగా ఈ ప్రయత్నం చేస్తున్నామని అమెరికన్ మోషన్ పిక్చర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నారు.

## జిందాబాద్! జిందాబాద్!

హైదరాబాదులో బంజారాహిల్స్‌లో వున్న సినిమా స్టూడియోలలో ఆదొకటి. వో ఫ్లోర్‌లో షూటింగు కొద్ది సేపట్లో మొదలవబోతోంది.

తీయబోయే దృశ్యంలో నటించే నటీనటులు మేకప్ గదులలో మేకప్ చేయించుకుంటున్నారు. ఆ చిత్ర నిర్మాతకి అదే తొలి సినిమా అనుభవం. అదే ముహూర్తం షాట్ కూడా. దాంతో ఎక్సైటింగ్‌గా కొద్ది పాటి పిరికితనంగా కూడా వుంది

తొమ్మిదీనలభై మూడు నిమిషాలకి ముహూర్తం. అంతా తొమ్మిదింపావుకలా రెడీ అయి మేకప్ గదులలోంచి బయటకి వచ్చారు. తమ తమ కుర్చీలలో కూర్చున్నారు అసిస్టెంట్ డైరెక్టర్స్ ఆర్టిస్టులకి వారి డైలాగ్స్ చెపుతున్నారు కొందరు ఆ సీన్ తాలూకు స్క్రిప్టుని చదువుకొని మనసులో తమ డైలాగ్సుని వల్లెవేసుకుంటున్నారు. అప్పుడప్పుడు ఇతర నటీనటులవంక మిర్రి మిర్రి చూస్తున్నారు.

అందులో వో డైలాగుని బిగ్గరగా చదివాడు హీరోగా నటించే బాబు.

"సమాజంలోని ఈ దుష్టశక్తులను సమూలంగా నాశనం చేయాలంటే మనమంతా ఏకమవాలి" బాబు డైరెక్టని పిలిచి చెప్పాడు

"ఇదే డైలాగుని ఇలా చెబితే బావుంటుందేమో చూడండి. సమాజంలోని ఈ దుష్టశక్తుల్ని సమూలంగా నశనం చేయాలంటే మనమంతా కాంగ్రెస్ పార్టీకే ఓటు వేయాలి"

"నువ్వు కాంగ్రెస్ పార్టీలోచేరి ఎన్నికలలో నిలబడ్డావని అలా మార్చమనడం బాగాలేదు అక్కడ అది అతకదు" చెప్పాడు డైరెక్టర్.

ఆ మాటలు విన్న హీరోయిన్ ఆశ్లేషాదేవి డైరెక్టర్‌తో గట్టిగా చెప్పింది.

"అతకదని తెలివిగా తప్పించకోకండి డైరెక్టరుగారు కాంగ్రెస్‌కి ఓటు వేసే సరికాదు, దుష్టశక్తులు సమూలంగా నాశనం అవ్వాలంటే మనమంతా బి.జెపికి వోటు వేసి గెలిపించాలని అనండి" కొద్దిగా ఉద్రేకంగా చెప్పింది.

ఆశ్లేషాదేవి జనరల్ ఎలక్షన్స్‌లో బిజెపిలో చేరి, ఆ పార్టీకి విస్తారంగా ప్రచారం చేసింది ఇందునిమిత్తం కొన్ని షూటింగులు కూడా రద్దుచేసుకుంది.

"ఏలాగయినా కాంగ్రెస్ కాంగ్రెసే మనకి స్వతంత్రం తెప్పించిన పార్టీ అది. దేశంలోని ప్రోగ్రెస్ అంతటికీ కారణమయిన పార్టీ మా పార్టీ" చెప్పాడు బాబు.

"బి జె పి కోసారి అధికారంలోకి వచ్చే అవకాశం ఇచ్చి చూడండి. మార్పు అన్నిటికీ మంచిది! దేశాన్ని మరింత ముందుకు తీసుకుపోతుంది" చెప్పింది హీరోయిన్!

"మొన్న ఎన్నికల ప్రచారంలో నువు గన్నవరంలో నామీదఏదో కూశావటగా?" అంతదాకా మనసులో వుంచుకొన్న మాటని అడిగాడు బాబు కోపంగా చూస్తూ!

"ఏమని?" అడిగింది హీరోయిన్!

"నేనెప్పుడూ తాగే వుంటానని, నాకసలు నటనే రాదని. సినిమాల లోకి నేనెలా వచ్చానో అర్థంకాదని....ఇంకా చాలా. నీకు తెలీదా నేనె ప్పుడూ తాగనని!"

"ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్షాలని తిట్టడం సాధారణం కాబట్టి నోటికొచ్చినట్లు మాట్లాడాను. ఆ మాటకి వస్తే నువు మాత్రం ప్రసన్న కుమార్ని తిట్టలేదేంటి?" అడిగింది ఆశ్లేషాదేవి

"నన్ను పబ్లిక్‌గా తిట్టే హక్కు నీకెవరిచ్చారు?" తీవ్రంగా అడి గాడు బాబు!

"కర్నూలులో బి జె పిని అడపార్టీ అని తిట్టే హక్కు నీకేవ రిచ్చారు?" అంత తీవ్రంగా అడిగింది హీరోయిన్! పక్క ఫ్లోర్‌లో వున్న ప్రసన్నకుమార్ బాబు అక్కడున్నాడని తెలిసి షూటింగు మధ్యలో వచ్చాడు!

"ఏరా బాబు! నేను బద్ధకస్తుణ్ణా! అర్ధరాత్రి దాటేదాకా క్లబ్బులో పేకాడి పుదయం ఆలస్యంగా లేచి షూటింగులకు ఆలస్యంగా వస్తానా? నువ్వు తీసిన సినిమాలలో నటించేప్పుడు, ఎప్పుడయినా అలా ఆలస్యంగా వచ్చానా? అలాంటి నేను నా పార్టీ గెలిస్తే ప్రభుత్వంలో బద్ధకం పెరుగు తుందని వేలమందున్న సభలో చెప్తావా? నువు ఇడియట్‌వి. నీ కాంగ్రెస్ పార్టీ ఇడియట్‌ది! మా జనతా పార్టీకున్న ఆదర్శాలు మరే పార్టీకి లేవు!"

అక్కడే వున్న సహాయనటుడు ప్రసన్నకుమార్‌ని చూడగానే హఠాత్తుగా లేచి ఆయన మీదమీదకి వెళుతూ కోపంగా అరిచాడు.

"ఏమిటేమిటి? మెకు దొరికింది కదాని నెలూరులో నీ యిష్ట వచ్చినటు పేలావుట? నేను బొకులో డబ్బు తీసుకుంటానా? నా పార్టీ గెలిచి నేను పదవిలోకి వస్తే బ్లాకు మార్కెటీర్స్‌ని ప్రోత్సహిస్తానా? ఇప్పుడీ సినిమాకి నువ్వెంత బ్లాక్‌మనీ తీసుకున్నావో నాకు తెలీదనుకుంటున్నావా! పబ్లిక్‌లో మాటాడేటప్పుడు ఆలోచించుకొని మాట్లాడకపోతే నాలిక కోసేస్తాను జాగ్రత్త!

ప్రసన్నకుమార్ ఆ సహాయనటుడి చెంపమీద గట్టిగా కొట్టి చెప్పాడు "నోర్ ముయ్యవోయ్".

ఇద్దరూ కొట్టుకోసాగారు.

బాబు వాళ్ళని విడిపించబోతే ఇద్దరూ "కాంగ్రెసుడౌన్ డౌన్" అని అరిచి అతన్ని రెండు కొట్టి దూరంగా తోసేసారు.

బాబు ఆవేశంగా లేచి నిలబడి "కాంగ్రెస్ జిందాబాద్. ఓట్ ఫర్ కాంగ్రెస్" అని అరవసాగాడు. ఆశ్లేషాదేవి కూడా లేచి కుర్చీ మీద నిలబడి ఇంకా గట్టిగా "బిజెపికే జిందాబాద్. బిజేపికే మీ ఓటివ్వండి" అని అరవసాగింది

అక్కడున్న ఓ జూనియర్ ఆర్టిస్టు "కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా జిందాబాద్" కమ్యూనిస్ట్ పార్టీ ఈజ్ ది హోప్ ఆఫ్ ఇండియా" అని అరవసాగాడు.

"ఎవరి మూడ్ బాగాలేదు కాబట్టి వాళ్ళు నటించలేరు. షూటింగ్ కేన్సిల్ పేకప్" అరిచాడు డైరెక్టర్.

ముహూర్తానికి క్లాప్ కొట్టడానికి వచ్చిన మంత్రి "తెలుగుదేశం జిందాబాద్ షూటింగ్ జరగాలి. తెలుగుదేశం జిందాబాద్" అని అరిచాడు.

నిర్మాత నెత్తిబాదుకున్నాడు.